


సుమారు ఐదేళ్ళ క్రితం అనుకుంటాను—ఆ అర్ధరాత్రి సోంపేట రైల్వేస్టేషనులో రైలు కోసం చూస్తున్నాన్నేను.

చలి-చీకటి-ఈదురు. గాలి వీటికి తోడు వర్షం.

ఒకటీ అరా దీపాలు వెల్గుతున్నాయ్ స్టేషన్‌లో. మాస్టారు ముదురు నీలం పూలు కోటూ—మఫ్లరూ శరీరానికి బిగించి ఆయన గదిలో కునుకుపాట్లు పడ్తున్నాడు. రంగు వెల్సిన ఎర్ర చొక్కా వేసు

కున్న కూలివాడు, వెయిటింగ్ రూమ్ బల్లమీద ముడుచు కూర్చున్నాడు. ఇక ప్రయాణీ కుణ్ని నేను వొక్కణ్నే.

నిజానికి నాకు చలన్నా, వర్ష మన్నా భయం-బాధ. ఈ ఊళ్ళు తిరిగే రిప్రజంటేటివ్ జాబ్ రాక పూర్వం మా ఊళ్ళో బాగా చీకటి పడ్డాక బయటికి వచ్చేవాణ్ని కాదు. ఇక వర్షం వచ్చిందా సరి! ఎండ పొడ పడి రోడ్డు ఆరితేనేగాని, అసలు బయటికి అడుగు పెట్టే వాణ్ని కాదు. అలాంటి నన్ను ఈ ఆంధ్రా బోర్డరులో ఉండగా ఈ నాలుగు శక్తులూ (నా దృష్టిలో) వూకుమ్మడిగా విజృంభిస్తే నేనేమై పోవాలి? మూడువందల మైళ్ళ దూరం ఈ ఊరికి మా ఊరు. నాకు బాధగా భయంగా వుంది. ఏదో నైరాశ్యం. వికీర్ణమైన ఆలో చన్లు. సరదాగా కబుర్లు చెప్పే నేస్తం ఈ క్షణంలో వుంటే ఎంత బావున్ను! ఆడదైతే? అంద మైందయితే?? ఊహకే ఎంతో లాలిత్యంగా వుంది. ఇక వాస్తవ దృశ్యీకరణ ఎంత రమ్యంగా వుంటుందో! లేదు- వూహే బాగుం టుంది. వాస్తవం సవ్యంగా ఏడ్వదు. తెల్సు!

సిగరెట్ వెలిగించాను. వర్షం తుంపరలు ముఖాన్ని కొట్టాయ్. శరీరానికి తిమ్మిరెక్కింది. మళ్ళీ ఆలోచన్లు.

వాటినీ, నిశ్శబ్దమైన నా గుండెలో లాలిత్యపు వూహల్నీ—గజిబిజి చప్పుళ్ళ వాతావరణాన్ని చీలుస్తూ ఓ గొంతు—

"అగ్గిపెట్టుందా మాస్టారూ?"

బాగా తడిసివున్నాడు మనిషి.

ఇచ్చాను అగ్గిపెట్టి.

"ఎక్కడి వరకూ వెళ్తారు?" మనిషడిగాడు అగ్గిపెట్టి తిరిగి యిస్తూ.

"వాల్తేరు."

"నేను పక్క స్టేషనే లెండి-పలాసా. అత్తవారి వూరు. ఆవిడ గారు రాణీలా పుట్టింట్లో కూర్చుని నన్ను రమ్మని కబురు చేస్తే వెళ్తున్నాను ఈ వర్షంలో తడిసి." చెప్పాడా మనిషి. చెప్పేటప్పుడు ఆ మాటల్లో కోపంగానీ, తీవ్రత గానీ లేవు. చాలా ప్రశాంతంగా ఆ మాటల్లో కాస్త హాస్యాన్ని రంగరించి చెప్తున్నాడు. స్పష్టంగా ముఖంలో కన్పించే అనుభూతి.

"ఈ వాతావరణం ఎలా వుంది?" అడిగానతన్ని.

సిగరెట్ వెనక్కి పీల్చి నవ్వా డతను. నవ్వులో శబ్దం లేదు.

"ఒకో మనిషికి ఒకో రకం

అనుభూతి ఏమంటారు?"
అన్నాడు.

"మీ ఫీలింగ్ ఎక్స్‌ప్రెస్ చెయ్యండి!" నేనన్నదానికి, అతను-

"మా వూళ్ళో...." అని అతనేదో మొదలు పెడుతుంటే—

"రండి—అలా బల్లమీద కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాన్నేను.

ఇద్దరం అటెళ్ళి కూర్చున్నాక-

"కన్నా అని ఒక టైప్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్‌గారి అబ్బాయి వుండే వాడు. అతనికి అద్దాల పెట్టెలో కూర్చుని జోరున కురిసే వర్షాన్ని చూడాలనిపిస్తుందట. అందుగ్గాను అతను ఓ బాక్స్‌కి మిర్రర్ ఫిట్ చేయించి, వర్షమొచ్చినప్పుడల్లా వినియోగించుకుంటాడు దాన్ని.

"వెంకటరత్నం అని ఇంకో స్నేహితుడున్నాడు నాకు. చీకటి గది కిటికీ ముందు కూర్చుని వర్షాన్ని చూస్తూ, టీ త్రాగుతూ, సిగరెట్ కాల్చాలనిపిస్తుందట అతనికి. ఆ ప్రివైలింగ్ థాట్‌ని ప్రాక్టికల్‌గా చేసి చక్కని అనుభూతి పొందుతాడతను. వర్షం రావడం ఒక పండగ అతనికి."

"మీకు?" అన్నాను.

అతను కొంచెం సిగ్గుపడి, "నిర్దుష్టంగా చెప్పాలంటే...." అని ఆగిపోయాడు.

"సందేహిస్తున్నారా? మనం ఈ చీకట్లో కలిశాం. ఈ చీకట్లోనే విడిపోతాం. అందుకని ఎలాంటి రహస్యాన్ని నా ముందు విశదపరిచినా నష్టం వుండదు. ఏమంటారు?" అన్నాను.

"కర్మసాక్షి నవలలో హీరోలా మాట్లాడుతున్నారు" అని నవ్వాడు.

"ఆ కర్మసాక్షి నవలెలా వుంటుందో నేనెప్పుడూ చూడలేదు. తీసుకోండి" అని సిగరెట్ ఇచ్చాను.

ఇద్దరం సిగరెట్లు వెలిగించాం మళ్ళీ.

అతను సిగరెట్‌పొగ వెనక్కిలాగి, నాకు చెప్పబోయేది ఆలోచిస్తున్నాడు.

చలికి నరాల్లో రక్తం చల్లబడుతూంది. పళ్ళు బిగబట్టి విశ్వాసాన్ని వదులుతున్నాను. ఈ వర్షం కురుస్తున్న అర్ధరాత్రి ఎవరన్నా టీ తెచ్చిస్తే బావుణ్ను అనిపిస్తుంది.

"చెప్పండి!" అన్నాను.

అతను—

"కిటికీలోంచి వర్షం-గాలి తుంపరగా పడుతుంటే, విస్తీర్ణం ఎక్కువున్న తెల్లటి పరుపుమీద

చాలీ చాలని ఉన్ని రగ్గులో నా భార్య, నేనూ—ప్రాన్సిస్కో డిగాయో భార్య మోనలీసా అందాన్ని గురించి చర్చించుకుని, పెనవేసుకు పడుకోవాలనిపిస్తుంది"

అతని ముఖంలోకి చూశాను క్షణం.

తియ్యటి అనుభూతి!

"మీ భార్యకు వర్షం అంటే యిష్టమా?"

"ప్రాణం. వాన దేవుణ్ణి పెళ్ళాడటం అసాధ్యం కనుక నన్నిష్టపడిందట."

ఆ మాటకి నాకు నవ్వురాదూ? వొచ్చింది.

మాస్టారు గంట కొట్టారు.

ఔటర్ సిగ్నల్ దాటి వచ్చేస్తుంది ట్రెయిను.

అతనికీ, నాకు టిక్కెట్లు నేనే తీసుకునే లోపున ట్రెయినాగింది ప్లాట్‌ఫారం మీద.

టిక్కెట్లు తీసుకుని పరుగున నేను వచ్చేలోపు నా సూట్‌కేస్ బోగీలో పెట్టాడు

"నా పేరు భామిరెడ్డి" మేం సీట్లలో సర్దుకు కూర్చున్నాకా, బండి వేగం పుంజుకున్నాకా చెప్పాడతను మెల్లగా నాతో.

ఈ చీకట్లో విడిపోయే మనం యెవరి కెవరమో-అన్న నా మాట అతనిలో బాగా నాటుకుపోయి వుండాలి.

"నా మిసెస్ పేరు సంకలనం చేసినట్టుంటుంది. వాళ్ళ బంధువుల్లో చాలా మంది రకరకాల పాత పేర్లు పెట్టి ఆమెని పిలుస్తుంటారు. అందుకని వాళ్ళ నానమ్మ తిన్నగా వుండక ఒక పొడుగాటి పేరు పెట్టేసింది."

"ఏమిటి?"

"చేస్తే బాగోదు. ఆ పేరు చెప్పాక మా ఆవిడ అందాన్ని తక్కువగా అంచనా వేస్తారు."

"ఎలా వుంటుందా పేరు?"

"ఎలా వుంటుందా? భలే అడిగారు మాస్టారూ! ఆమె అందమైన చూపుడు వేలంత పొడుగుంటుంది. లేదా, సన్నటి కత్తిలాంటి ఆమె కనుబొమ్మంత లెంగ్తయినా వుండాలి. కనీసం నవ్వినప్పుడు సాగే ఆమె పెదవి అంతయినా వుండి తీరుతుంది."

"యేం పేరు?"

"రోజా మేరీ కమల."

"చిత్రంగా వుంది. అన్వయం కాని అర్థాలు. ఒకో చెరగునుంచి యేరి తెంపి కలిపినట్టున్నాయి."

"మొదటే చెప్పాగా—ఎడిటింగ్ టైటిల్ అని. నేను మాత్రం కమలా అని పిలుస్తాను....మాది

ఇంటర్ కాస్ట్ మేరేజ్.

"మా వాళ్ళంతా తూలనాడారు. ఆవిడ నల్లగా వుంటుంది. ఐనా అందంగా వుంటుంది. తెల్లచీరలు కడుతుంది. ఇష్టమట. నవ్వినప్పుడు కృత్రిమ చంద్రోదయం అయి నట్టుంటుంది కళ్ళతో మాట్లాడే భాష తెల్సు. గీతల్ని దాటినట్టు నడ వడం తెలుసు ఇందుక్కాదు మా వాళ్ళంతా తిట్టడం. క్రిష్టియన్— అందుకు. పెళ్ళికాక మునుపు ఆమె నాకు ఉత్తరాలు రాసేది. రాత్రి వేళలే రాసేది ఉత్తరం ముగిస్తూ ఆమె రాసే ఆఖరి వాక్యం ఏమిటో తెల్సా? 'నిద్రొస్తోంది ఇంక పడు కుంటానేం?' అనే ప్రశ్నతో ముగింపు."

భామిరెడ్డి చెప్పడం కాస్త ఆపాడు. బోగీలో మా ప్రక్కన కూర్చున్న పంచెకట్టు మనిషి నవ్వుకుంటున్నాడు. భామిరెడ్డి పంచె కట్టు మనిషిని చూడలేదు. నేనే అతన్ని చూశాను.

ఇద్దరం సిగరెట్లు అంటించాం. చలిగాలి అని గ్లాస్ విండో మూశాను.

భామిరెడ్డి—

"మా వూళ్ళో రెండు కొండ లుండేవి. వాటిని తూరుపు కొండలు అనేవారు. ఆమే, నేనూ పందాలు వేసుకొని ఆ కొండలు ఎక్కే వాళ్ళం. గెలుపు ఒకరిదే కాదు: ఎవరు ముందెక్కితే వాళ్ళు రెండో మనిషికి చెయ్యందివ్వాలి. అలా ఒకళ్ళనొకళ్ళం అంది పుచ్చుకొని, శిఖరం ఎక్కడం అయ్యాక, అల సటతో ఒకరిమీద ఒకరం వాలి పోయే వాళ్ళం. మృదు పవనుడు మాకు విందునిచ్చేవాడు" అని ఆగి, లేచి కంపార్టుమెంట్ ద్వారం వేపు వెళ్ళాడు. అది తెరిచి వున్న కారణంగా లోనికి చలిగాలి ప్రసారం అవుతుంది. నాకోసం దానిని మూసే ప్రయత్నాలు చేస్తున్నాడు. కానీ ఎంత ప్రయత్నించినా అది పడటం లేదు.


విజయ

కొత్త సీరియల్ ప్రారంభం!

వివరాలు

వచ్చే సంచికలో

పంచెకట్టు అతను నా దగ్గర కొచ్చి—

"ఆ తలుపు వేస్తున్న మనిషి ఏం చెప్పుతున్నాడు?" అన్నాడు.

"జీవితాన్నీ, ప్రేమనీ—అను భూతుల్నీ ఇంకా అనుభవాల్నీ రంగరించి చెప్పుతున్నాడు. అత నలా చెప్పుతుంటే బ్రహ్మచారినైన నాకు నామీదే ఎలర్జీ పుడుతుంది" అన్నాను ఉద్రేకం ఆపుకోలేక.

దానికి పంచె కట్టాయన—

"అతను చెప్పేదంతా నిజం అనుకుంటున్నారు కదూ?" అన్నాడు.

"మరి?"

"అతనికి ముఖపరిచయమున్న ఒక స్త్రీ క్రితం సంవత్సరం ఆప రేషన్ చేయించుకుని సక్సెస్‌కాక బ్లీడింగయ్యి చనిపోయింది. ఆమె సమాధి పలాసలో ఉందట. ఇతను పగలంతా ఏం పని చేస్తాడో తెలీదు. రాత్రయ్యేనరికి ప్రతి రోజూ ఈ అర్ధరాత్రి ట్రెయిన్ కాచ్ చేసి ఆ సమాధి దగ్గర కొస్తాడు."

"నిజమా?"

"నా మాటలో అబద్ధం ఉందను కుంటే, మళ్ళీ ఎప్పుడయినా ఇదే బండికి సోంపేటలో వెయిట్ చెయ్యండి. ఇతను తారసపడక పోతే ఒట్టు!"

"మీకెలా తెల్సు?"

"నేను ప్రతి రాత్రీ భువనేశ్వర్ నుంచి పలాసకి ఇదే బండిలో వస్తాను. పలాసలో కాష్యూనట్ హోల్‌సేల్‌గా పర్చేజ్ చేసుకుని ఉదయం బండికి వెళ్తాను" అన్నాడు పంచెకట్టాయన.

"అలాగా!" అని ఏవో కంటి చూపులు కిరణాల్లా నా చెంపకి తగిలినట్టనిపిస్తే ఇటు చూశాను. భామిరెడ్డి ఎప్పుడొచ్చాడో పక్కనే నిలబడి వింటున్నాడు. అతని ముఖం మ్లానమై వుంది.

పలాస స్టేషనొచ్చింది.

భామిరెడ్డి దిగిపోయాడు-కనీసం వెళ్తానని కూడా చెప్పకుండా.

* * *

టూర్లు చేసే రిప్రజంటేటివ్‌గా పనిచేసే నేను, చాలాసార్లు అదే సోంపేటలో అదే ట్రెయిన్‌కోసం వెయిట్ చేసి ఎక్కాను.

కానీ భామిరెడ్డి నాకు మళ్ళీ కనిపించలేదు.

ఊహని వాస్తవంగా పక్క వాడికి చెప్పి అనుభూతి చెందుదా మనుకునే మనుషులకి. అది కల్పితం అని చెప్పే మనుషులు పక్కనే ఉంటారని ఆనాటితో అనుభవమై ఉంటుంది భామిరెడ్డికి. *